ఈనాడు సూర్యాపేట

ఆదివారం అక్టోబరు 20, 2024

అన్నికులాల అవివాహితులకు సువర్ణావకాశం



నేడు అన్ని కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్నికులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. సూర్యాపేట జమ్మిగడ్డలోని ఈనాడు కార్యాలయంలో (సర్వే నెంబరు 49, సబ్‌స్టేషన్ దగ్గరలో, 33/11KVA) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (20 అక్టోబర్ 2024, ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 9154992572 & 8008002165 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.


ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా రామారావు



కోదాడ, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా కోదాడకు చెందిన వంగవీటి రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రామారావు స్వస్థలం పట్టణ పరిధిలోని కొమబండ ప్రాంతం. గతంలో కోదాడ ఎంపీపీగా పని చేశారు. 1985 నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పని చేస్తున్నారు. కోదాడ ప్రాంతం నుంచి 50 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి నల్గొండ గ్రంథాలయ ఛైర్మన్‌గా గుడుగుంట్ల అప్పయ్య పని చేయగా, ఇప్పుడు రెండో వ్యక్తిగా రామారావు నియామకం కావడంతో పట్టణ వాసులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బియ్యంలో రారాజు నల్గొండ




హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కృష్ణా నీటి ఆధారంగా ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సాగు అవుతుంది. అలా పండిన ధాన్యం మంచిదని, నాణ్యమైందని గతంలో నిర్వహించిన పరీక్షల్లోనూ తేలింది. రెండు రకాలుగా పరీక్షలు నిర్వహించి నాణ్యతను నిర్ధారించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కృష్ణా జలాలతో వరి పండుతున్నా.. నల్గొండ జిల్లాలో పండిన ధాన్యం నాణ్యమైందని నిరూపణ కాగా, రుచికరమైందని కూడా అంటుంటారు. అందుకే నాణ్యమైన, రుచికరమైన బియ్యానికి నల్గొండ రారాజు అన్న పేరుంది. అన్నం రుచిని గుర్తించిన వారు ఏ ప్రాంతంలో ఉన్నా నల్గొండ ప్యాకింగ్ బియ్యం కొనుగోలు చేసేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతారు. నాణ్యత, రుచి ఉండటం వల్ల ఏ జిల్లా బియ్యం కూడా ఇక్కడి బియ్యంతో పోటీ పడలేవని వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లా నుంచి భారీ ఎగుమతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి షరతులు లేకుంటే ఒక్క జిల్లా నుంచే దాదాపు 1.5 లక్షల నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతులు జరుగుతుంటాయి. ఇందులో సింహభాగం బాయిల్డ్ బియ్యమే అయినా పచ్చి బియ్యం కూడా ఎగుమతి జరుగుతుంది. దేశంలో ఎక్కువగా ఎగుమతులు జరుగుతుండటంతో బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఎగుమతి సుంకాలను భారీగా పెంచింది. దేశంలోని ఇతర రాష్ట్రాలకు మాత్రం భారీగానే ఎగుమతి జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు ధరలను సమీక్షించుకుంటూ ఎగుమతులకు అనుమతులు ఇస్తుంది. ఉమ్మడి జిల్లాలో 300 మిల్లులు ఉండగా అందులో పచ్చిబియ్యం మిల్లులు 120, మిగతా బాయిల్డ్ మిల్లులు ఉన్నాయి.

★ జిల్లా నుంచి సింగపూర్, మలేషియా, దుబాయ్‌తో పాటు అన్ని అరబ్ దేశాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. వీటితో పాటు ఆఫ్రికా దేశాలకు పచ్చి బియ్యం, బాయిల్డ్ బియ్యం సరఫరా అవుతాయి. గతంలో పాకిస్థాన్‌కు కూడా జిల్లా నుంచి ఎగుమతులు జరిగాయి. ఇతర దేశాలకు ఎగుమతి దారులు వారు కోరిన ప్యాకింగ్‌లలో ఇస్తారు.



దేశంలో ఇలా...

మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు బియ్యం ఎగుమతులు జిల్లా నుంచి జరుగుతాయి. మహారాష్ట్రలో జైశ్రీరామ్ (చింట్లు) రకం పచ్చి బియ్యానికి మంచి డిమాండ్ ఉండటంతో ఎక్కువగా ఎగుమతి జరుగుతున్నాయి. మన దగ్గర ఎక్కువగా వాడే బీపీటీ కంటే సన్నగా జైశ్రీరాం ఉన్నా మన రాష్ట్రంలో వీటి వాడకం తక్కువని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల ఇతర రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఒక సీజన్‌లో సాగు (ఎకరాల్లో), దిగుబడి (మెట్రిక్ టన్నులలో) అంచనా వివరాలు

జిల్లా	సన్నరకాల సాగు	దిగుబడి	దొడ్డు రకాల సాగు	దిగుబడి
నల్గొండ	2,42,490	5,81,975	1,90,527	4,57,265
సూర్యాపేట	3,41,650	8,19,960	1,09,042	3,05,318
యాదాద్రి	97,028	1,74,650	52,245	1,04,490

చెరువులోకి చేపొచ్చే..!



మునగాల మండలం మాధవరంలో బుధవారం చేప పిల్లలను వదులుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులు నాయక్, అధికారులు

భానుపురి, న్యూస్‌టుడే: ఎట్టకేలకు చెరువుకు చేప పిల్లలొచ్చాయి. మత్స్యశాఖ అధికారులు బుధవారం నుంచి చేప పిల్లల విడుదలను ప్రారంభించారు. టెండర్లలో నెలకొన్న జాప్యం కారణంగా కొంత ఆలస్యం జరిగింది. కొందరు గుత్తేదారులు చేప పిల్లల పెంపకం చేపట్టకుండానే టెండర్లలో పాల్గొన్నారు. అధికారుల తనిఖీల్లో బయటపడటంతో వాటిని రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. ఇటీవల అన్నీ పూర్తి చేసిన మత్స్యశాఖ అధికారులు విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

6.84లక్షల మీనాల విడుదల

జిల్లాలో చెరువుల ఎంపికలో మత్స్యశాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. నిత్యం నీరుండే జలాశయాలను ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం చెరువులు, కుంటలు కలుపుకొని 850 ఉండగా.. అధికారులు నీరింకిపోని 621 చెరువులను ఎంపిక చేశారు. చెరువుల్లో చేపలు వదిలేందుకు నలుగురు గుత్తేదారులను ఎంపిక చేశారు. టెండర్ల ప్రక్రియ ముగియడంతో వెంటనే లక్ష్యం మేరకు 1.72 కోట్ల చేప పిల్లల విడుదలపై దృష్టిసారించారు. ఎంపిక చేసిన చెరువుల్లో బొచ్చా, రవ్వు, మరిగాల, బంగారు తీగ రకాలను వదులుతున్నారు. ఇప్పటి 18 గ్రామాల్లోని 52 చెరువుల్లో మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను వదిలారు. బుధవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా నాలుగురోజుల్లో 52 చెరువుల్లో 6,84,586 చేప పిల్లలు విడిచిపెట్టారు.

నెలాఖరు వరకు పూర్తి

ఇప్పటికే ఆలస్యం కావడంతో చేపల ఎదుగుదలపై కొంత ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో అధికారులు ఈ నెలాఖరు వరకు ఎంపిక చేసిన చెరువుల్లో మీనాలను వదలనున్నారు. ఈ సంవత్సరంలో ఇంకా ఆరు నెలల సమయం ఉండటంతో చేపలు ఎదిగే అవకాశం ఉందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఏప్రిల్, మే నెల వరకు రెండు, మూడు కిలోలు పెరిగే అవకాశం ఉంది. చేప పిల్లల విడుదల చేస్తుండటంతో మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

> **ముమ్మరంగా చేపడతాం..**
>
> – నాగులు నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, సూర్యాపేట
>
> జిల్లాలో చేప పిల్లల విడుదల కొంత ఆలస్యమైనా ఈ నెలాఖరు వరకు ఎంపిక చేసిన చెరువుల్లో వదులుతాం. మీనాల ఎదుగుదలపై ఎలాంటి ఆందోళన అవసరం లేదు. ఆరునెలల్లో చేపలు పెరిగే అవకాశం ఉంది.

పంచనారసింహులకు భక్తుల మొక్కు పూజలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: పంచనారసింహులు కొలువై ఉన్న యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం భక్తజనుల ఆరాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం నిర్వహించిన పూజారులు బిందెతీర్థంతో చేపట్టిన కైంకర్యాలు ఆలయ విశిష్టతకు అనుగుణంగా కొనసాగాయి. గర్భాలయంలో కొలువై ఉన్న స్వయంభువులను మేల్కొల్పిన పూజారులు హారతితో కొలిచారు. అర్చామూర్తులను పంచామృతంతో అభిషేకించి తులసీ దళాలతో అర్చన చేపట్టారు. కవచమూర్తులకు సువర్ణ పుష్పార్చన జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పర్వాలను కొనసాగించారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం ఆలయ ఆచార వ్యవహారాలతో నిర్వహించారు. వర్షం కురవడంతో అలంకార జోడు సేవలను ఆలయంలోనే ఊరేగించారు. భక్తులు హరిహరులను దర్శించుకుని, ఆంజనేయస్వామిని కొలుస్తూ, సహస్రనామార్చ నిర్వహించారు.

ఆరబెట్టిన ధాన్యానికి మద్దతు ధర: అదనపు కలెక్టర్



సూర్యాపేట కుసుమవారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: రైతులు కొనుగోలు కేంద్రాలకు ఆరబెట్టిన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్. లత కోరారు. సూర్యాపేట పురపాలిక పరిధిలోని కుసుమవారిగూడెంలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 17 శాతం తేమ ఉండాలని, తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, కమిషనర్ శ్రీనివాస్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేట(తాళ్లగడ్డ): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎస్వో రాజేశ్వర్ సూచించారు. సూర్యాపేట మండలం ఇమాంపేట, కేసారం, తాళ్లఖమ్మంపాడుతోపాటు పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో మొత్తం 266 కేంద్రాలను ప్రారంభించినట్లు చెప్పారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలనే వేర్వేరుగా ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ నాగలక్ష్మి, ఎంపీడీవో లక్ష్మి, ఏవో కృష్ణసందీప్, ఏఈవో సుష్మస్వరాజ్, ఏపీఎం వెంకన్న, సీసీలు సైదులు, సునీత పాల్గొన్నారు.

రైతు పోరాటాల్లో భాగస్వాములు కావాలి: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై చేపట్టే పోరాటాల్లో భారాస నాయకులు భాగస్వాములు కావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో రెండో రోజు పెన్‌పహాడ్, చివ్వెంల మండల ముఖ్య నేతలతో శనివారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అండగా ఉండటం మన బాధ్యతగా భావించాలన్నారు. అదనంగా ఇంకేదో ఇస్తుందన్న ఆశతో నమ్మి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నిజస్వరూపం బయట పడుతోందన్నారు. కేసీఆర్‌ను దూరం చేసుకున్నామన్న ప్రశ్చాత్తాపం ప్రజల్లో వ్యక్తం అవుతోందన్నారు. కార్యకర్తలే భారాసకు బలం, బలగమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యతను కోల్పోవద్దని హితవు పలికారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

కమ్ముకున్న కారుమేఘం.. రైతుల్లో కలవరం

కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రైతులు కలవర పడుతున్నారు. చేతికొచ్చిన పంటను ఇంటికి తీసుకెళ్తామో లేదోనని బెంగపడుతున్నారు. శనివారం సాయంత్రం ఆకాశంలో ఒక వైపు మేఘాలు కమ్ముకోగా.. మరోవైపు ఎండ కొట్టింది. ఏ క్షణంలో వర్షం కురుస్తుందోనని రైతులు అయోమయానికి గురయ్యారు. ఆరబోసిన వడ్లను కొందరు ట్రాక్టర్లతో కుప్పచేసుకున్నారు. మబ్బులు పట్టిన దిక్కు నుంచి కాకుండా ఎండ కొట్టిన దిక్కు నుంచి వాన దంచికొట్టగా కొద్దిమేర ధాన్యం తడిసిపోయింది.

– తుంగతుర్తి, న్యూస్‌టుడే:



నల్లని మేఘాలు అలముకోవడంతో ధాన్యాన్ని ట్రాక్టర్‌తో కుప్ప పోస్తున్న రైతులు

ఎక్కడికీ వెళ్లొద్దు టీచర్..!

తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే.. ఆ చిన్నారులు తట్టుకోలేకపోయారు. ఉపాధ్యాయుల చుట్టూ చేరి.. ఎక్కడికి వెళ్లొద్దని, తమ బడిలో ఉండాలంటూ విలపించారు. రోదిస్తున్న చిన్నారులను చూసి ఉపాధ్యాయులూ కంటతడి పెట్టారు. ఈ ఘటన శనివారం తుంగతుర్తి మండలం వెంపటి ప్రాథమిక పాఠశాలలో చోటుచేసుకుంది. గత 11 ఏళ్లుగా ఆ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్‌లకు శనివారం వెంపటి ప్రాథమిక పాఠశాలలో వీడ్కోలు, కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు స్వాగత సమావేశం ఏర్పాటు చేశారు. వారందరినీ ప్రధానోపాధ్యాయిని వెంకటరామనర్సమ్మ, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. అప్పటి వరకు సరదాగా గడిపిన విద్యార్థులు ఉపాధ్యాయులు బయటకు వెళ్లేందుకు గేటు వద్దకు రాగానే ఒక్కసారి గుంపుగా వారి చుట్టూ చేరి కన్నీరుపెట్టుకున్నారు. మమ్ములను వదిలి పోవద్దని గట్టిగా పట్టుకొని విలపించారు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు చెమ్మగిల్లిన కళ్లతో వారికి వీడ్కోలు పలికారు. –తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే:



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయిని జ్యోతి చుట్టూ చేరి విలపిస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి మార్కెట్‌లో 21 నుంచి కొనుగోళ్లు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ప్రతిరోజు మార్కెట్‌లో క్రయ,విక్రయాలు జరిగేందుకు వ్యాపారులు, హమాలీ కార్మికులు సహకరించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఆర్. సంతోష్ కోరారు. 'తిరుమలగిరి మార్కెట్‌లో కొనుగోళ్లు బంద్' శీర్షికన శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. స్థానిక మార్కెట్ కార్యాలయంలో వ్యాపారులు, హమాలీ కార్మికులతో సమావేశమయ్యారు. ప్లాస్టిక్ సంచుల కారణంగా చేతుల మండి అనారోగ్యానికి గురవుతున్నట్లు హమాలీ కార్మికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గోనె సంచుల కొరత కారణంగా ప్లాస్టిక్ సంచుల్లో తూకాలు వేయాలని వ్యాపారులు కోరారు. అనంతరం వ్యాపారులు, హమాలీ కార్మికులు సమన్వయం చేసుకొని ఈనెల 21 నుంచి నెల పని దినాలలో మార్కెట్‌కు వచ్చే మొత్తం సరకులను 80శాతం గోనె బస్తాలు, 20 శాతం ప్లాస్టిక్ బస్తాలలో తూకాలు వేసే విధంగా ఒప్పందం చేసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో సోమవారం నుంచి మార్కెట్‌కు రైతులు పంట ఉత్పత్తులు తీసుకురావాలని మార్కెట్ అధికారులు కోరారు. సమావేశంలో మార్కెట్ కార్యదర్శి దేశబోయిన శ్రీధర్, సూపర్‌వైజర్ అనిల్, సిబ్బంది శివ, వ్యాపారులు సామ ఆంజనేయులు, సంకేపల్లి నర్సింహారెడ్డి, దామెర కృష్ణమూర్తి, వెంపటి సుధాకర్, పాలెపు చంద్రశేఖర్, హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు గాజుల శ్రీను, జీడి దాసు, దేశగాని నర్సింహ, యాదగిరి, కొండయ్య, సోమన్న పాల్గొన్నారు.



జాలువారుతున్న జలం.. హృదయాలు పులకించే తరుణం



నల్లమల అటవీప్రాంతాల్లో జాలువారుతున్న జలపాతాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. దేవరచర్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో పురాతన శివాలయం వద్ద, రేకులగడ్డ, చిత్రియాల గ్రామాల సమీపంలోని మామిడిగుండాల జలపాతంతోపాటు పొగిళ్ల గ్రామ సమీపంలోని గవ్వలసరి జలపాతాలు వరుసగా కురుస్తున్న వానలకు జాలువారుతూ సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. ఆయా ప్రదేశాల్లో అడవి జంతువులు సంచరిస్తున్నాయన్న హెచ్చరికలు ఉన్నప్పటికీ పర్యాటకులు ఈ జలసవ్వడులను చూసేందుకు బారులు తీరుతున్నారు. దేవరచర్ల నల్లమల అటవీ ప్రాంతంలో కనువిందు చేస్తున్న జలపాత దృశ్యమిది.

– న్యూస్‌టుడే, చందంపేట

నీడనిచ్చే షెడ్.. విరాళాల విభాగం ఏర్పాటు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులలో నడవలేని వారితో పాటు వృద్ధులు, చంటి పిల్లల తల్లులు ప్రధానాలయానికి చేర్చే బ్యాటరీ వాహనాల కోసం వేచి ఉండేందుకు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రత్యేక షెడ్‌ను నిర్మించింది. వీవీఐపీల వాహనాల పార్కింగ్ ప్రాంగణంలోని బ్యాటరీ వాహనాల స్టాండ్ వద్ద నీడనిచ్చే షెడ్‌తో పాటు కూర్చునేందుకు బెంచీలు ఏర్పరిచారు. బస్‌స్టాండ్, కార్ పార్కింగ్ నుంచి వృద్ధులు, గర్భిణులు, బాలింతలు నడుస్తూ ఆలయానికి చేరడం కష్టమే. వారి కోసం దాతల సహకారంతో బ్యాటరీ వాహనాలు కల్పించిన దేవస్థానం ఇతర వసతులు కల్పిస్తోంది.



విరాళాల సేకరణ కోసం ఏర్పాటైన విభాగం

★ ఆలయ కైంకర్యాలు, అన్నప్రసాదం, గదుల నిర్మాణానికి దాతలు సమర్పించే విరాళాల సేకరణకు ప్రధానాలయ మాడవీధిలో ప్రత్యేక విభాగం నిర్మించారు. ఆలయానికి అనుగుణంగా ఫైబర్ షీట్ల ద్వారా దేవుడి బ్రహ్మోత్సవ రథశాల పక్కనే సదరు విభాగం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

డ్యాంను పరిశీలించిన సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాంను సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సీఈ నిత్యానంద ముఖర్జీ శనివారం సందర్శించారు. ఆయన ఈ సందర్శనలో భాగంగా హాలియా ప్రాంతంలోని ఎడమ కాల్వపై, సాగర్ డ్యాం దగ్గర ఉన్న నీటి విడుదలకు సంబంధించిన టెలిమెంటరీ సిస్టమ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎన్నెస్పీ ఈఈ మల్లికార్జునరావు, ఏఈ కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నడత నేర్పిన తరం.. తరలిపోతోంది..!



న్యూస్‌టుడే, నాంపల్లి

పాల నురగకు తీసిపోని దవళ వర్ణపు వస్త్రధారణ.. రాజసాన్ని చూపే పంచెకట్టు.. హుందాతనానికి గుర్తుగా తాత మీసంకట్టు.. ఆత్మ గౌరవాన్ని కళ్లకద్దే బామ్మ బొట్టు.. క్రమేణ జీవన యానంతో అధిరోహించిన వయసు మెట్టు.. పనస సౌరభం లాంటి స్వేద సుగంధంతో తనువు చాలించే వరకూ తప్పని నీతి పట్టు.. స్వచ్ఛమైన మనసు.. మధురమైన పలకరింపుతో మన కలలను నిజం చేసిన పెద్దల తరం వెళ్లిపోతోంది. జీవన కడలిలో కష్టాల సుడిగుండాలు చుట్టిముట్టినా తొణకని గంభీర స్వరం మూగబోతోంది. ధర్మనిష్ఠ పాటిస్తూ కుటుంబాలకు నాగరికత నేర్పిన నాటి తరం.. తరతరాలకు తీపి సూక్తులుగా మిగిలిపోనున్నారు. తాత, అమ్మమ్మ, నానమ్మ ఇలా.. కాలక్రమేణా ఒక నాటి పెద్దల తరం వయోభారంతో కనుమరుగవుతోంది.

దీపాల వెలుగుల్లో దేదీప్య జీవనం..

పూటగడవని ఆ రోజుల్లో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా పస్తులైనా భరించే వారు తప్ప ఇంటి గుట్టు బయటపడనిచ్చే వారు కాదు. 'కాకి పిల్ల కాకికి ముద్దు' సామెత చందంగా చిరిగిన బట్టలు కుట్టుకొని ధరించే ఇంటి పెద్ద తమ సంతానానికి ఆ లోటు రానిచ్చేవారు కాదు. పచ్చడి మెతుకులే పరమాన్నంగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. తాము పడే 'ఈతి' బాధలు పక్కింటి వారితో కూడా చర్చించే వారు కాదు. రోజువారీ పనికి సమయంతో పనిలేదనే భావన వారిలో ఉండేది. వ్యవసాయానికి యంత్రాలు లేని నాటి కాలంలో.. తెల్లవారకముందే నాగలి పట్టి పొలంలో నిమగ్నమై దీపాలు పెట్టే వేళకు ఇల్లు చేరేవారు. పగలంతా పడిన కష్టాన్ని మరిచి మిణుకు మిణుకుమంటూ వెలిగే నూనె దీపాల వెలుగులో ఇంటిల్లిపాది కూర్చొని కాచిన గంజి.. మెతుకులో కలిసి తినడం వారికి సంతృప్తినిచ్చేది. నాగరికత నడక నేర్చుకునే రోజుల్లోనే కుటుంబాల కోసం సర్వం ధారపోసిన ఆ పెద్దలు నేడు క్రమంగా కనుమరుగవుతున్నారు.

పెద్దల మాట పరమాన్నం మూట..

'పెద్దల మాట చద్దన్నం మూట' సామెత అందరికీ తెలిసిందే. ఆ రోజుల్లో ఆత్మీయతలు ఉమ్మడి కుటుంబాల్లో ఉండేవి. ఒక్కో ఇంట్లో పగలూ రాత్రి కలిసి 20 కిలోల వరకు ఆహార ధాన్యాలు వండి వార్చే వారంటే అతిశయోక్తి కాదు. ఒక కుటుంబంలో 10 నుంచి 20 మంది వరకు కుటుంబ సభ్యులున్నా భేషజాలు ఉండేవి కావు. అంతమందిలోనూ నీతి నియమాలే కట్టుబాట్లుగా కుటుంబ పెద్ద చెప్పిందే వేదం. తమ కుటుంబంలోని పిల్లలకు పెళ్లి సంబంధాలు చూడాలన్నా.. పెళ్లిళ్లు చేయాలన్నా ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకునేవారు. ఇక శుభకార్యాలకు ఏ ఒక్క ఇల్లూ బంధువుల మర్యాదలతో ఆహ్వానించి వారం రోజులు వెళ్లనిచ్చేవారు కాదు. ఇలా రోజంతా వచ్చిపోయే బంధుత్వపు పిలుపులతో పల్లె లోగిళ్లు కళకళలాడేవి. ఈ మమకారానికి కారణం ఆ పెద్దయనే సుమా..! ఆలీ చంపుకొని కుటుంబం కోసం పరితపించిన పెద్దయిన, పెద్దమనిషి కడుపున పుట్టిన బిడ్డలు చేరదీయకపోవడంతో ఇప్పటికీ కొన్నిచోట్ల అనాధాశ్రమాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. ☛ ఇది మన సంస్కృతి కాదు కదా. తమకోసం ఏమీ దాచుకోకుండా.. సమాజానికి నడ(వడి) నేర్పిన పెద్దలు.. వయోభారంతో మన్నుల వదిలి వెళ్తుంటే.. కంట నీరు ఆగనంటోంది. మనసు మౌనంగా రోదిస్తోంది. మరుజన్మ అంటూ లేదో తెలీదు కాబట్టి మనకు జన్మనిచ్చిన వారిని, నడత నేర్పిన పెద్దలను ఈ జన్మలోనే గౌరవిద్దాం. వారిని కడవరకూ కుటుంబాలలోనే కలిసి ఉండేలా చూద్దాం. వారి ఆశలు.. ఆశయాలు.. ఆకాంక్షలు నెరవేర్చడం బాధ్యతగా తీసుకుందాం.

తమకంటూ ఏమీ దాచుకోలేదు..

ప్రస్తుతం పల్లెల్లో దాబా ఇళ్లు, అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయి. గతంలో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కార్మికులకంటే ఇంటి యజమాని ఎక్కువ కష్టించేవారు. మట్టి, కలప ఎడ్ల బండితో ముందస్తుగా చేరవేసేవారు. తామూ ఓ కార్మికుడై ఇంటి నిర్మాణంలో పాలుపంచుకునేవారు. తాము కట్టుకున్న అరకొర వసతుల గూటిలోనే పిల్లా పాపలతో ఆనందంగా గడిపేవారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తాము నమ్ముకున్న భూమి, కట్టుకున్న ఇల్లు మాత్రం అమ్మకానికి పెట్టేవారు కాదు. తల్లిదండ్రులను ఎంత ఆప్యాయంగా చూసుకునేవారో పంట క్షేత్రాన్ని, పాడి సంపదనూ అంతే ప్రేమగా ఆరాధించేవారు. తమ బిడ్డలు నిరాశ్రయులు కావొద్దనే ఆకాంక్షతో తమ కాంక్షలెన్నో చంపుకొన్నారు. తాము సంపాదించిన ఆస్తిలో ఇసుమంతైనా అమ్ముకోకుండా కుటుంబ శ్రేయస్సు కోసం శ్రమించిన పెద్దలు వెళ్లిపోతున్నారు.

ఆ రోజుల్లో ఎనలేని గౌరవం



అంబల్ల చెన్నయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు, నాంపల్లి

పూర్వం సమాజంలో పెద్దల మాటకు ఎనలేని గౌరవం ఉండేది. ఏ పని చేయాలన్నా వారి సలహాలు, సూచనలు పాటించే వారు. ఆ కారణంతోనే అప్పట్లో కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు పటిష్ఠంగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. మన నడవడి మన పిల్లలకు భవిష్యత్తు పాఠం నేర్పుతుందనే విషయం విస్మరించొద్దు. నేటి తరం వారు పెద్దల సూచనలు పాటించి, వారి పట్ల ప్రేమ చూపిస్తే రేపటితరం కూడా అదే నేర్చుకుంటారు. పెద్దలు ఆత్మీయత పంచే అక్షయ పాత్ర లాంటి వారు. వారిని గౌరవించడం అందరి బాధ్యత.

జన్మాంతం కుటుంబశ్రేయస్సుకే...



వీరమల్ల లక్ష్మమ్మ, నాంపల్లి

జీవితమంతా కుటుంబ శ్రేయస్సు కోసం ధారపోసిన పెద్దలు వృద్ధాప్యంలో కోరుకునేది ఆత్మసంతృప్తి, ఆదెరువు దొరుకుతుందని. కన్న బిడ్డలు ప్రయోజకులుగా మారి స్థిరపడి ఉన్నప్పుడు.. ప్రేమ, ఆప్యాయత చూపినప్పుడు. ప్రస్తుతం ఉపాధి కోసం, ఉరుకుల పరుగుల జీవితంలో అన్ని కుటుంబాల్లో అది సాధ్యం కావడం లేదు. ఉన్న సమయంలోనే కొంత ముదిమిలో ఉన్న కన్నవారి కోసం కేటాయిస్తే వారికి కనుల సంబరంగా ఉంటుంది. అంతకు మించి వారు ఆశించేది కూడా ఏమీ ఉండదు.

నేడు ఖోఖో ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా జూనియర్ ఖోఖో బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలను గుర్రంపోడు మండలం కొప్పోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాతి కృష్ణమూర్తి తెలిపారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 18 ఏళ్లలోపు వయసు ఉండి, నవంబరు 22, 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని సూచించారు. వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో ఆదివారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన వారు అక్టోబరు 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

రూ.పది నాణెం చెల్లుతుంది

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో పది రూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రయాణికులు ఇచ్చే రూ.10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలు సైతం జారీ చేశారు. ఇంత ప్రచారం చేపడుతున్నా.. అవగాహన రాహిత్యంతో కొంత మంది ప్రజలు కూడా పది రూపాయల నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు.



రాజపేట బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన గోడపత్రిక

అసలెందుకీ పరిస్థితి..

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్ద నోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలా మంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులకు తెరలేపారని కొందరి వాదన. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ.కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రధానంగా బ్యాంకు సేవలకు వచ్చేవారికి కనిపించే విధంగా బ్యాంకు కార్యాలయం ప్రాంగణంలో పదిరూపాయల నాణేల చెల్లింపుల పోస్టర్లను, ఫ్లెక్సీలను బ్యాంకు అధికారులు ప్రదర్శిస్తుండటం విశేషం.

అవగాహన కల్పిస్తున్నాం..

– తిరుమలశెట్టి నాగలక్ష్మి, మేనేజరు, గ్రామీణ వికాసబ్యాంకు, రాజపేట

పది రూపాయల నాణేలు చెలామణి విషయమై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఎవరైనా వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తే చట్టపరంగా చర్యలుంటాయనే విషయాన్ని సైతం వివరిస్తున్నాం. అపోహలను నమ్మకుండా నిరభ్యంతరంగా పది రూపాయల నాణేలను తీసుకోవచ్చు. తిరిగి చెల్లించవచ్చు.

18 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల


నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతం నుంచి సాగర్‌కు వరద నీటిరాక కొనసాగుతుండగా ఎన్నెస్పీ అధికారులు 18 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం రాత్రి 9 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,90,198 క్యూసెక్కుల వరద వస్తుండగా ఎన్నెస్పీ అధికారులు డ్యాం 26 గేట్లలో 18 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 1,45,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.



విడుదలవుతున్న నీరు

గేట్లతో పాటు కుడికాల్వ ద్వారా 6,112 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 6,173 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 29,313 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కులు మొత్తం 1,90,198 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 590.00 అడుగుల వద్ద ఉంది.

నూతన వీసీగా బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొ.అల్తాఫ్ హుస్సేన్

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొ.అల్తాఫ్ హుస్సేన్ శనివారం వర్సిటీలోని ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వీసీగా పనిచేసిన అనుభవంతో వర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటుగా వారి విద్యాభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు. యూనివర్సిటీతో పాటు పరిధిలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రణాళికలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశోధన పరిజ్ఞానం పెంపొందించేలా సెమినార్లు నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి అధ్యాపకులు, సిబ్బందితో ముచ్చటించారు. నూతన వీసీకి ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ టూ వీసీ ప్రొ.అంజిరెడ్డి, వై.ప్రశాంతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటరమణారెడ్డి, అరుణప్రియ, రాంరెడ్డి, ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు అభినందించారు.

శ్రీహరి కోటకు..తేజ విద్యార్థి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ, భారత కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో.. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులకు 'జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్-2024' పోటీలు నిర్వహించారని, అందులో ప్రతిభ చూపిన కోదాడకు చెందిన విద్యార్థి గుజ్జుల హర్షవర్ధన్ రెడ్డి ఎంపికైనట్లు తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా తెలిపారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 30 వరకు ఈ పోటీలను నిర్వహించగా.. 3,66,308 మంది పాల్గొన్నారని, అందులో 100 మందిని ఎంపిక చేశారన్నారు. తేజ పాఠశాల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా 7వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి ఎంపికయ్యాడని తెలిపారు. ఎంపికైన వారిని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)వారు అంతరిక్ష రాకెట్ ప్రయోగ కేంద్రం శ్రీహరి కోటను సందర్శించే అవకాశం కల్పించినట్లు చెప్పారు. హర్షవర్ధన్‌రెడ్డిని డైరెక్టర్ సోమిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



హర్షవర్ధన్‌రెడ్డిని అభినందిస్తున్న తేజ విద్యాలయ ప్రిన్సిపల్ రమా

కోదాడ
•కోదాడ •హుజూర్‌నగర్

రైతు భరోసా ఎగవేతపై నేడు భారాస నిరసన

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతు భరోసా ఎగవేతపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆదివారం కోదాడ నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకరా నికి రూ.15 వేలు రైతు భరోసా అందిస్తామని రైతు లను మోసగించిన ప్రభుత్వం పాలనను ఎండగట్టాలని కోరుతూ భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రాల్లో 10 గంటలకు రైతులు, ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఫసల్ బీమా లేక నష్టపోతున్న రైతులు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల రైతులకు నష్టం వాటిల్లుతోందని భాజపా కిసాన్ మోర్చా నేరేడుచర్ల అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం నేరేడుచర్ల మండలంలో కురిసిన అకాల వర్షం వల్ల గింజ పోసుకునే దశలో పొలాలు నేల కొరిగి రైతులకు తీరని నష్టం జరిగిందన్నారు. పంట నష్టం జరి గిన రైతుల పొలాలను పరిశీలించి పరిహారం అందించాలని కోరారు.



తేజ పాఠశాలలో గెలుపొందిన విజేతలతో పాఠశాల యాజమాన్యం



తేజ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎస్వీ విద్యా సంస్థల ఛైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు

పరీక్ష రాసి.. ప్రతిభ చూపి

కోదాడ పట్టణంలోని తేజ పాఠశాల విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థులలో సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో కె. దేదీప్య ప్రథమ, టి.నిత్యశ్రీ, ద్వితీయ, ఎస్. రాహుల్ తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. పాఠశాల ప్రిన్సిపల్ బి. సోమ్లా నాయక్, కార్యదర్శి సంతోష్ బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు అప్పారావు, రాంమూర్తి, రమేష్, రాంబాబు, వాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

❑ కోదాడ పట్టణంలోని ఎస్వీ పాఠశాల విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థుల్లో సామాజిక మాధ్యమ ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎం.సాయికృష్ణ, ప్రథమ, ఎం.శ్రావణి, ద్వితీయ, ఎం.డి.తస్నీన్ మెహక్, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఎస్వీ విద్యా సంస్థల ఛైర్మన్ ముత్తినేని సైదేశ్వర రావు, ప్రిన్సిపల్ వల్లి పద్మలు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. –కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:



ఎస్వీ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించండి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఆటో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు షేక్.యాకూబ్ డిమాండ్ చేశారు. గరిడేపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నెలకు రూ.10వేలు ఇస్తామని నేటికీ వారి గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆటో ఫైనాన్స్ చెల్లించలేక వడ్డీలకు తెచ్చి వారి లను అమ్ముకుని రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సైదులు, సంతోష్, చంద్రయ్య, భాస్కర్, సంపత్ కుమార్, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

నారాయణపుర వాసికి జాతీయ అవార్డు

చిలుకూరు, న్యూస్‌టుడే: దేశ రాజధాని దిల్లీలో ఆర్గనైజేషన్ కమిటీ ఎన్‌హెచ్‌డబ్ల్యూఏ, ఎన్ఈబీపీ వారు అందజేసే నేషనల్ ఎమర్జెన్సీ ఫిజిషియన్ ఆఫ్ ది అవార్డు- 2024 అత్యవసర విభాగంలో చిలుకూరు మండలం నారాయణ పురం(పాలెఅన్నారం)నకు చెందిన డాక్టర్ **మాగి జానకీరామ్**ను ఎంపిక చేసి శుక్రవారం తనకు అందజేసినట్లుగా శనివారం ఆయన విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను టెలికన్సల్టెన్సీ (చరవాణి ద్వారా వైద్యం) పేద ప్రజలకు ఉచిత వైద్య సహాయం చేసినందుకు ఈ అవార్డును బహుకరించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఎండ్‌మోల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ఎల్బిట్ మెడికల్ డయాగ్నోస్టిక్ కంపెనీలలో ఎమర్జెన్సీ విభాగంలో ఫిజియన్‌గా విధులను నిర్వహిస్తూ శ్రీ తబస్సుమ్ జలీబ్, ముదిత్‌ల సహాయ సహకారాలతో నా కళను నెరవేర్చుకున్నట్లుగా తెలిపారు.



మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: దిర్శించర్ల నుంచి చిట్టెప్పవారి గూడెం మీదుగా ముత్యాలమ్మ కుంట వరకు తారు రోడ్డు నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.3.20 కోట్లు మంజూరు చేయడంతో శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన్నవెంకటరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాపోలు నర్సయ్యల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం జరిపారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మార్కెట్ వైస్‌ఛైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కత్తి శ్రీనివాసరెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మోదాల వెంకట సైదులు, పాండునాయక్, సైదిరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడకు చెందిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వంగవీటి రామారావు జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా నియమితులవ్వడం అభినందనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏర్నేని బాబు అన్నారు. గ్రంథాలయ ఛైర్మన్ రామారావును శనివారం తన ఇంటికి ఆహ్వానించి సన్మానించి మాట్లాడారు. నాగేశ్వరరావు, వెంకటేశ్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ఐకాస నాయకుడు సోమగాని నరేందర్‌గౌడ్ కోరారు. రాష్ట్రంలో 12.50 లక్షల మంది విద్యార్థులు ఉపకార వేతనాలు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతూ శనివారం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. పిల్లుట్ల లింగయ్య, వినియోగదారుల డివిజన్ కార్యదర్శి పందిరి యల్లారెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారత చట్టం తీసుకు రావాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: మహిళా సాధికారత చట్టం తీసుకవచ్చేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు తంగెళ్ల వెంకటచంద్ర కోరారు. అమరవీరుల స్మారక భవనంలో ఐద్వా రాష్ట్ర 4వ మహాసభల గోడ పత్రికలను శనివారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన



హుజూర్‌నగర్ ఐద్వా మహాసభల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయని విమర్శించారు. ఇందిరాల త్రివేణి, సుందరి రమ, ప్రియాంక, ఝాన్సీ, నాగేంద్ర పాల్గొన్నారు.

సోలార్ దీపాలు అందజేత

మఠంపల్లి, న్యూస్‌టుడే: బీమా గ్రామంగా ప్రకటించిన పెదవీడుకు ఎల్ఐసీ రూ.50వేలు విలువైన రెండు వీధి దీపాలను అందజేసినట్లు ఆ సంస్థ ఏజెంట్లు ఎస్ వెంకటేశ్వరరెడ్డి, ఎం.శివశంకర్ తెలిపారు. ఇక్కడి చింతలమ్మగూడెం శ్మశాన వాటిక, మడేలు స్వామి ఆలయం వద్ద సోలార్ దీపాలను శనివారం ఏర్పాటు చేసిన అనంతరం వారు మాట్లాడారు. సీతారాంరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వీరాస్వామి విశ్వరూపాచారి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగులపై పోలీసులు లాఠీఛార్జి చేయడం అమానుషం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ అశోక్‌నగర్‌లో జీవో నంబర్ 29న సమీక్షించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రూప్-1 అభ్యర్థులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసులచే లాఠీచార్జీ చేయించడం అమానుషం అని జడ్పీటీసీ మాజీ సభ్యులు కొప్పుల సైదిరెడ్డి శనివారం శనివారం అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని అడిగితే వారిపై లాఠీచార్జీ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీవో పద్మ అన్నారు. మండల పరిధిలోని తొగర్రాయిలో శనివారం కోదాడ ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ వాజిద్ అలి, ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, నరేష్, ప్రభాకర్‌రావు, పుల్లయ్య, శ్రీనివాసరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

గరిడేపల్లి: రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకువస్తే మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి బోనస్ లభిస్తుందని తహసీల్దారు బండ కవిత అన్నారు. కీతవారి



తొగర్రాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీవో పద్మ

గూడెం సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రం శనివారం ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంటాలు, రవాణా, వర్షం వచ్చినప్పుడు పట్టాలు తదితర జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఏవో ప్రియతమ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కమల, ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మునగాల: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతుల ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని నేలమర్రి, నర్సింహులగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నెలకొల్పిన, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొక్కిరేణి, గణపవరం, ఆకుపాముల గ్రామాల్లో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. సీసీ సత్యం, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు: కొండాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు ధృవ కుమార్ శనివారం ప్రారంభించారు. ఏవో శ్రీధర్, ఏపీఎం నర్సయ్య, ఆర్ఐ సీతయ్య, ఐకేపీ సీసీలు గురుమూర్తి, స్వరూప, వీబీకే కవిత పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తహసీల్దార్ నాగేందర్, పీఏసీఎస్ ఛైర్మన్ కట్టా గోపాలరావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లింగగిరి ఆధ్వర్యంలో శ్రీనివాసపురం, లింగగిరి గ్రామాల్లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. మద్దతు ధరతో పాటు సన్న రకానికి క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు శీలం నరసింహరావు, తోట వీరస్వామి, సాముల నర్సిరెడ్డి, కొనుగంటి కోటిరెడ్డి, సీఈవో జనార్ధన్‌రావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోతె.: మండలంలోని విభళాపురం, ఉర్లుగొండ తదితర గ్రామాల్లో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సంఘమిత్ర ప్రారంభించారు. ఏపీఎం వెంకయ్య, ఆర్ఐ మన్సూర్ అలీ, కీసర సంతోష్‌రెడ్డి, సీసీ శ్రీను, పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందానికి చొరవ తీసుకోవాలి

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగు వేతన ఒప్పందానికి మిల్లర్లు చొరవ తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, భారాసకేవీ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను శనివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులను కలిసి



హుజూర్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

వినతిపత్రం ఇచ్చారు. పాత ఒప్పంద గడువు ముగిసినందున నూతన ఒప్పందానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పొలిశెట్టి నరసింహరావు, నాయకులు గజ్జి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు డ్రైవర్ల డిమాండ్లు అమలు చేయాలి

హుజూర్‌నగర్ గ్రామీణం: రైస్‌మిల్లు డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి లక్ష్మీ నరసింహారావు కలిసి రైస్ మిల్లు డ్రైవర్ యూనియన్‌కు సంబంధించిన 16 డిమాండ్లతో కూడిన డిమాండ్ పత్రాన్ని శుక్రవారం రాత్రి అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అనుబంధ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు గుండెబోయిన వెంకన్న, కార్యదర్శి కంకణాల రామయ్య, కోశాధికారి గుంటి రాంబాబు, శాసనాల శ్రీను, జోగి వెంకన్న, పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించే పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ పూర్వ విద్యార్థి నాయకులు రాయపూడి చిన్ని, పందిరి నాగిరెడ్డిలు కోరారు. స్థానిక ఎం.ఎస్. కళాశాలలో శనివారం ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. రాఘవరెడ్డి, అప్పిరెడ్డి, నర్సింహారావు, ఉదయగిరి, హరికిషన్‌రావు, చందర్‌రావు, ఉదయ్ పాల్గొన్నారు.

జీవనాధారం చూపించి..

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన షేక్ వరాబేగం ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇబ్బందులు పడుతున్న విషయం జమాతే ఇస్లామి హింద్ సంస్థకు తెలియచేయగా వారు ఆమెకు దుకాణం పెట్టించి జీవనభృతి కల్పించారు. వరాబేగంకు జీవనాధారం కోసం ఒక దుకాణం ఏర్పాటు చేయించి అందులోకి అవసరమైన సరకులను శనివారం అందజేశారు. రోజువారిగా దుకాణం నడుపుకొని కుటుంబాన్ని పోషించుకునేలా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను, మజీదును పలువురు అభినందించారు.



హుజూర్‌నగర్‌లో దుకాణంలోకి కావాల్సిన సరకులు అందిస్తున్న పట్టణ జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షుడు మజీద్

తెలుగు భాషపై అవగాహన పెంపు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: తెలుగు భాషపై క్విజ్ పోటీలు నిర్వహించడంతో తెలుగు భాష పట్ల అవగాహన పెరుగుతుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు మార్కండేయ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగు భాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. తెలుగు భాషా వ్యాకరణం, పరిజ్ఞానం, గ్రంథాలు, కవులు, రచనలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, చిన్నప్ప, జానకీరామ్, బడుగుల సైదులు, రవి తదితరులున్నారు.



క్విజ్ పోటీల్లో గెలుపొందిన విజేతలతో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్కండేయ, ఉపాధ్యాయులు

న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైంది

కోదాడ, న్యూస్‌టుడే: సమాజంలో న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైందని, ఆ పవిత్రతను కాపాడేందుకు ప్రతి న్యాయవాది కృషి చేయాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్యాంసుందర్ అన్నారు. ఇటీవల సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది, బదిలీపై వెళ్తుండటంతో కోదాడ బార్ అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్య, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహారావు, పాల్గొన్నారు.



పదోన్నతిపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్‌ను సన్మానిస్తున్న కోదాడ బార్ అసోసియేషన్ కార్యవర్గం

శివలీలా విలాసం పురాణవిజ్ఞాన ప్రవచనం



మేళ్లచెరువులో శివలీలా విలాస పురాణాన్ని ప్రవచిస్తున్న బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి ఆలయంలో నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామీజీ శనివారం శ్రీ శివ లీలా విలాస పురాణ విజ్ఞాన ప్రవచనాన్ని ప్రవచించారు. ఆలయంలో స్వామి వారికి సుప్రబాత సేవతో స్వామి వారికి మహాన్యాస పూర్వక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ అర్చన పూజలు అలంకారాలతో విశేష అర్చనలు చేశారు. కొంకిపాక శివ విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయ శర్మ, భానుప్రకాశ్ శర్మ, ఈవో కొండారెడ్డి, ఛైర్మన్ శంభిరెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నమోదుపై ప్రచారం

చిలుకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ సభ్యత్వ నమోదుపై శనివారం ప్రచారం నిర్వహించి, పత్రాలను ఎస్టీయూ సంఘం నాయకులు అందజేశారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి అంకిరెడ్డి, సురగాని లింగయ్యగౌడ్, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, గుండు ఆదినారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

మునగాల: ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓట్లను ఎన్‌రోల్ చేయించుకోవాలని పీఆర్టీయూ టీఎస్ మండల శాఖ అధ్యక్షుడు అడిదల వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. మేకల మధుబాబు, ఎంఈవో వెంకటేశ్వర్లు, వీరబాబు, సునీతారాణి, సైదయ్య పాల్గొన్నారు.



చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నమోదు పత్రాలను అందజేస్తున్న ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం పాలకవీడు జడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బాలకృష్ణ అవగాహన కల్పించారు. పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి తొలిప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. మండల ప్రధానకార్యదర్శి జి.ధర్మరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ యూసుఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాబు, మండల అసోసియేట్ అధ్యక్షుడు అంజయ్య, శేఖర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతోనే సాగు లాభసాటి

గరిడేపల్లి, న్యూస్‌టుడే: సమగ్ర వ్యవసాయ విధానంతోనే సాగు లాభసాటిగా ఉంటుందని గడ్డిపల్లి కేవీకే ఇన్‌ఛార్జి డి.నరేష్ అన్నారు. హైదరాబాద్‌లోని తుర్కమంజల్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ విద్యార్థులు క్షేత్ర సందర్శనకు వచ్చిన సందర్భంగా వారికి లాభసాటి వ్యవసాయానికి అనుసరించాల్సిన విధి విధానాలను వివరించారు. ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, ఆదాయం వచ్చే పంటలను సాగుచేయాలని సూచించారు. అందుకు సేంద్రియ సాగు మేలని మార్కెట్‌లో నాణ్యమైన గిరాకీ లభిస్తుందన్నారు. జీవన ఎరువుల తయారీ, వర్మీకంపోస్ట్, భూసార పరీక్ష కేంద్రం, తేనెటీగల పెంపకం, పండ్ల తోటల పెంపకం, నర్సరీలు, కూరగాయల సాగులో మల్చింగ్‌విధానం పై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సీహెచ్.నరేష్, డి.ఆదర్శ్, టి.మాధురి, ఎన్.సుగంధి సహకరించారు. ఎస్ఏఐఆర్‌డీ డైరెక్టర్ గంటా లక్ష్మి, యూనివర్సిటీ డీన్ ఎస్.శ్రీనివాసరావు, సౌరబ్ విద్యార్థులు పాల్గొన్నారు.



పండ్ల తోటల్లో అంతర పంటల సాగు గురించి విద్యార్థులకు వివరిస్తున్న శాస్త్రవేత్త

దివ్యాంగులకు బస్సు పాస్ మేళా .. హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గ దివ్యాంగుల కోసం బస్సు పాస్ మేళా ఏర్పాటు చేసినట్లు కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్ పాత బస్టాండ్‌లో ఈనెల 21, 22, మఠంపల్లిలో 23న, మేళ్లచెరువులో 25న చింతలపాలెం 28న బస్సు పాస్ మేళా జరుగుతుందని దివ్యాంగులు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

'ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయ జోక్యం తగదు'.. కోదాడ పట్టణం: నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండొద్దని, నిజమైన లబ్ధిదారున్ని గుర్తించి న్యాయం జరిగేలా చూడాలని తెదేపా రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉప్పగండ్ల సరోజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఎంపికలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగలేదని, అర్హులను ఎంపిక చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, ఎమ్మెల్యే పద్మావతిలకు విజ్ఞప్తి చేశారు.

శిక్షణలు సద్వినియోగం చేసుకోవాలి.. కోదాడ పట్టణం: విద్యార్థినులు శిక్షణలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో

సంక్షిప్తసమాచారం

ఉద్యోగాలు సాధించాలని కిట్స్ కళాశాల ప్రిన్సిపల్ గాంధీ, డైరెక్టర్ సీహెచ్.నాగార్జునరావులు అన్నారు. స్థానిక కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన టాస్క్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ నరేందర్‌గౌడ్ మాట్లాడారు. విభాగాధిపతి స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పతనం ఖాయం'.. కోదాడ పట్టణం: పూటకో మాట రోజుకో వాగ్దానంతో రైతులను ఆట పట్టిస్తూ పబ్బం గడుపుతున్న ప్రభుత్వం పతనానికి సమయం ఆసన్నమైందని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు విమర్శించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడారు.

రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలి.. చిలుకూరు: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో బీసీ సంఘ నాయకులతో కలిసి శనివారం విలేకర్లతో మాట్లాడారు. బీసీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ బాదే నర్సయ్య, రాము పాల్గొన్నారు.

పంటనష్టం జరిగిన రైతులను ఆదుకోవాలి.. నేరేడుచర్ల: అకాల వర్షంతో పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. నేరేడుచర్ల అరిబండి భవన్‌లో శనివారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీమా చెక్కు అందజేత.. హుజూర్‌నగర్ గ్రామీణం: జీవిత బీమా పేదలకు పెన్నిది లాంటిదని టాటా ఏఐఏ మైక్రో జీవిత బీమా సంస్థ కోదాడ శాఖ మేనేజర్ పోలిశెట్టి సైదులు అన్నారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన రెడ్డిచర్ల లచ్చయ్య టాటా ఏఐఏ జీవిత బీమా పాలసీదారుడు మృతి చెందారు. నామిని అయిన అతని భార్య బాలమ్మకు కంపెనీ నుంచి వచ్చిన రూ.20 వేల చెక్కు అందజేశారు.

6న నిరసన దీక్షలు.. మునగాల: ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలైనా తగ్గించాలి... కార్మికుల వేతనాలైనా పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో అమరుల స్మారక భవనంలో శనివారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 5, 6 తేదీల్లో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూర స్వరాజ్యం, నాగరాజు, శేఖర్, వీరబాబు, సత్యనారాయణ, కోటయ్య, సుందరయ్య పాల్గొన్నారు

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, వేట్టయన్, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

మృతదేహం వెలికి తీసి పంచనామా

గరిడేపల్లి: పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పంచనామా చేసిన ఘటన గానుగబండలో చోటుచేసుకుంది. ఎస్సై చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం. . గ్రామానికి చెందిన షేక్.దస్తగిరి(50) గురువారం పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోయాడు. మృతుడి బాబాయి కుమారుడు సైదా ఈ మరణంపై అనుమానాలున్నట్లు శనివారం ఫిర్యాదు చేశాడు. దాంతో తహసీల్దారు కవిత సమక్షంలో హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యులు సునీల్, లోహిత పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పూడ్చివేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన ఘటన అమరవరం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం అమరవరం గ్రామానికి చెందిన బూర్గుల నాగమణి(46) ఇంట్లోని వరండాలో ఇనుప తీగపై దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు ఆ ఇనుప తీగకు విద్యుత్ సరఫరా అయి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి చిన్న కుమారుడు బూర్గుల రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తొలిదశ ఉద్యమకారుడు..

హుజూర్‌నగర్ గ్రామీణం: పట్టణానికి చెందిన తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు పెండ్యాల నాగేశ్వరరావు(77) శుక్రవారం రాత్రి అకాల మరణం పొందారు. నాగేశ్వరరావు 1969లో జరిగిన తొలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆయన మృతికి వివిధ సంఘాల నాయకులు నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులు డైమండ్ నేత్ర నిధికి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుమారులు నాగరాజు, నారాయణరావు, కుమార్తె భవానిలు శనివారం నేత్రాలను దానం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల రామ్‌నరేష్, బూరుగు శ్రీనివాస్ స్వామి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

కనీస వేతన చట్టం అమలు చేయాలి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కూలీ మహిళలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వ్యవసాయ మహిళా కూలీ రాష్ట్ర కన్వీనర్ బొప్పాని పద్మ డిమాండ్ చేశారు. సూర్యాపేటలో శనివారం జిల్లా మహిళా కూలీల సదస్సుకు హాజరై మాట్లాడారు. సమాజంలో సగభాగం ఉన్న అతివలు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పులుసు సత్యం, సోమపంగు జానయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, ఉప్పయ్య, వనం సోమయ్య, ఉయ్యాల పారిజాత పాల్గొన్నారు.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని కుడకుడలో ఇళ్లలోని నీరు రోడ్డుపక్కన పారుతోంది. నిల్వ ఉన్న చోట వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడుతున్నాయి. – నరేష్, కుడకుడ

✔ నివాస గృహాల వారితో మాట్లాడి సమస్య లేకుండా చూస్తాం. – తిరుమలయ్య, పుర ఏఈ, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని నల్లాలబావి రోడ్డు నుంచి వి.టి. కాలనీకి వెళ్లే సీసీ రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – జాని, సూర్యాపేట

✔ పరిశీలించి మరమ్మతు చేపడతాం. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

క్రమం తప్పకుండా టీకాలు వేయించండి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు జరిపించి క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పుర ఛైర్‌పర్సన్ శాగంటి అనసూయ అన్నారు. శనివారం అనంతారంలో 'జాతీయ వ్యాధి నిరోధక టీకాల' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వైద్యులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సహజ కాన్పులు జరిగేలా చూడాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి మాలోతు విప్లవనాయక్, కమలమ్మ, బేబీ, దనమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం: భారాస

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: వానాకాలం పంటకు రైతు భరోసా ఇచ్చేది లేదని తేల్చిచెప్పిన కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని భారాస



జనగామ క్రాస్‌రోడ్డులో నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సూర్యాపేట జనగామ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శనివారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రైతులను కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నారని గుర్తుచేశారు. రైతు భరోసా ఇచ్చే వరకు అన్నదాతల పక్షాన నిలబడి పోరాడుతామని పేర్కొన్నారు.

నేడు భారాస నిరసన కార్యక్రమాలు.. తుంగతుర్తి: కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా ఎగవేత విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం అన్ని మండల కేంద్రాల్లో భారాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ప్రకటనను మండల పార్టీ నాయకులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎకరాకు రూ.15 వేలు చొప్పున రైతు భరోసా చెల్లిస్తామని హామీ ఇచ్చి నేడు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నూతనకల్, న్యూస్‌టుడే: మండలకేంద్రానికి చెందిన సాబాది వాసుదేవ్ రెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి ఇటీవల మృతిచెందారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించడానికి ఎమ్మెల్యే మందుల సామేల్ చరకంటి చంద్రారెడ్డితో రూ. 50 వేలు పంపించారు. శనివారం మృతుడి కుమారులకు చంద్రారెడ్డి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో బద్దం వెంకటరెడ్డి, పన్నాల మల్లారెడ్డి, యాస శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

భానుపురి, న్యూస్‌టుడే: పెన్‌పహాడ్ ఎంపీవోగా పని చేస్తున్న దాసరి సంజీవయ్య సూర్యాపేట ఇన్‌ఛార్జి ఎంపీవోగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంపీడీవో లక్ష్మీ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్‌కుమార్, మమత, దశరథ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారంలో అడుగిడి.. స్వయం ఉపాధి సాధించి



వారివి మధ్య తరగతి కుటుంబాలు. బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలనేది తల్లిదండ్రుల సంకల్పం. వారి ఆలోచనలకు అనుగుణంగా ఉన్నత చదువులు చదివారు. మంచి వేతనాలతో ఉద్యోగాలు చేశారు. తల్లిదండ్రులకు తోడుగా ఉండాలనే లక్ష్యంతో ఉన్న ఊరిలోనే స్వయం ఉపాధి మార్గం ఎన్నుకొని ఉద్యోగ వేతనానికి దీటుగా సంపాదిస్తున్న తిరుమలగిరి మండలంలోని యువకులపై 'న్యూస్‌టుడే' కథనం. - తిరుమలగిరి, న్యూస్‌టుడే

సొంతంగా ఏదైనా చేయాలని..



– మహేశ్వరం అఖిలాక్, ఎంబీఏ, బీఈడీ, తిరుమలగిరి

చదువు పూర్తయ్యాక ప్రైవేటు కంపెనీలో మార్కెటింగ్‌లో ఉద్యోగం చేశాను. నెలకు రూ.30 వేల వరకు వేతనం ఇచ్చేవారు. అక్కడి విధానం నచ్చక ఉద్యోగం వదిలేసి తిరుమలగిరిలో 2019లో ఇంటర్‌నెట్, డిజిటల్ సేవాకేంద్రం ప్రారంభించాను. ఇటు ఫొటో, వీడియో కెమెరాలు అద్దెకు ఇవ్వడంతోపాటు ప్రైవేటు ట్రావెల్స్ నడిపిస్తున్నాను. నెలకు రూ.40 వరకు సంపాదిస్తున్నాను. ఇంటి వద్దనే ఉంటూ కుటుంబ సభ్యులతో హాయిగా నివసిస్తున్నా.

తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నా..



– కారుపోతుల అనిల్‌కుమార్, బీటెక్, ఈటూరు

2020లో బీటెక్ పూర్తయ్యాక పుణెలో మూడేళ్లు రూ.40 వేల వేతనంతో ప్రైవేటు ఉద్యోగం చేశాను. పని ఒత్తిడి ఎక్కువగా ఉండేది. రూ. 90 వేల వేతనం వచ్చే ఉద్యోగం వచ్చినా ఒత్తిడి తట్టుకోలేక ఉద్యోగం వదిలేశాను. మానాన్న శ్రీను గ్రామీణ వైద్యుడు. ఆయన సలహా మేరకు 2024 జనవరిలో తిరుమలగిరిలో ఫార్మా మెడికల్ ఏజెన్సీ పెట్టాను. ప్రస్తుతం బాగా నడుస్తోంది. నెలకు రూ. 50 వేలు వస్తున్నాయి. మా తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నందుకు సంతోషంగా ఉంది.

చదువుతూనే సంపాదన..



– ఇరుకుల శ్రవణ్‌కుమార్, ఎంబీఏ, డీఫార్మసీ, మాలిపురం

దూరవిద్య ద్వారా డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నప్పుడే సెల్‌ఫోన్స్ సెల్స్ దుకాణం ప్రారంభించాను. అనంతరం ఎంబీఏ, డీఫార్మసీ పూర్తిచేశాను. కొంతకాలం హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేశాను. ఇష్టం లేక 2017లో తిరుమలగిరిలో సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, లాప్‌టాప్‌ల విక్రయం, మరమ్మతు కేంద్రాన్ని నెలకొల్పాను. స్థానిక ఆంగ్ల మాధ్యమ ప్రైవేటు పాఠశాలలో వారంలో రెండ్రోజులు కంప్యూటర్ తరగతులు చెబుతున్నా. ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం కంటె ఎక్కువగా సంపాదిస్తున్నా.

పిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా సంక్షేమాధికారి నరసింహారావు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలికలు తమ భవిష్యత్తుపై ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి నరసింహారావు అన్నారు. మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలెంల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో మాట్లాడారు. సమాజంలో ఉన్నత ఆలోచన చేసిన మహిళలు వివిధ స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారని.. వీరు గ్రామ స్థాయి, నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. పిల్లల సంరక్షణ చట్టాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలికలకు సీడబ్ల్యూసీ ఛైర్మన్ రమణారావు, సభ్యులు రాంరెడ్డి, భిక్షం, సఖి సెంటర్ అడ్మిన్ హేమలత, డీసీపీవో రవికుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, మీరా, వెంకటరత్నం, లింగయ్య, వాణి, ప్రవీణ్‌కుమార్, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బదిలీ వీడ్కోలు సన్మానం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: మండలంలోని మాచారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ బదిలీ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయినిగా పదోన్నతి పొందిన సావిత్రి, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్, డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించిన



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయిని చంద్రకళ

రజియా సుల్తానాను స్థానిక ప్రధానోపాధ్యాయిని చంద్రకళ, గూడెపుకుంట తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఆర్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అల్లాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. నూతనంగా వచ్చిన ఎస్జీటీ హరికృష్ణకు స్వాగతం పలికారు. అనంతరం చీదెళ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని సావిత్రి విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామగ్రి అందజేశారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేటలోని సంఘ కార్యాలయంలో ఈ నెల 21న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు శనివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వరంగల్ మ్యాక్సీ శరత్ లేజర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఈ శిబిరం నిర్వహించనున్నామని, పింఛన్‌దారులు, ఆరోగ్యశ్రీ కార్డుదారులు వినియోగించుకోవాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

వైద్య పరీక్షలు.. జాజిరెడ్డిగూడెం: మండలంలోని కొమ్మాల, కోడూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అర్వపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నగేష్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల.. తిరుమలగిరి: మాలల సంక్షేమం కోసం ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లాలో చేపట్టే మహాపాదయాత్ర కరపత్రాలను శనివారం మాల మహానాడు మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌరస్తాలో విడుదల చేశారు. మండలశాఖ అధ్యక్షుడు గంట లక్ష్మణ్, గంట సందీప్, ఉదయ్, మద్దెల ప్రభుదాస్, దాసరి ప్రకాశ్, గంట యాకోబ్, గడ్డి దిలీప్ పాల్గొన్నారు.

అన్ని రకాల వడ్లు కొనాలి.. నూతనకల్(గ్రామీణం): సన్న రకం, దొడ్డు రకం వరి ధాన్యాన్ని అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని భారాస మండల సహాయ కార్యదర్శి గాడుదుల లింగరాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఎర్రపహాడ్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఎర్రపహాడ్‌లో దొడ్డు రకం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, సన్న వడ్లు పండించిన రైతులు దిర్శన్‌పల్లి, పెదనెమిల, నూతనకల్ కేంద్రాలలో విక్రయించాలని అధికారులు చెబుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

పింఛన్‌దారుల భవనానికి విరాళం.. తిరుమలగిరి: తిరుమలగిరిలో నిర్మించే పింఛన్‌దారుల భవన సముదాయం కోసం శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు సంకేపల్లి సుధీర్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో బన్వరి నర్సయ్య, దామోదరాచారి, మంద పద్మారెడ్డి, కాకి వెంకట్‌రెడ్డి, మల్లయ్య, సుదర్శన్‌రావు, సత్యానారాయణ పాల్గొన్నారు.

యోగా పోటీలో ప్రతిభ.. సూర్యాపేట సాంస్కృతికం: విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో 33వ మానవత డే నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ఛాంపియన్‌షిప్ యోగతాన్ ఛాలెంజ్ 2024 పోటీలలో సూర్యాపేటకు చెందిన గూడూరు నాగేశ్వర్‌రావు, దేశగాని ఉప్పలయ్య ఉత్తమ ప్రతిభ కనబరిచారి బహుమతిని గెలుపొందినట్లు శనివారం వారు తెలిపారు. 108 సూర్య నమస్కారాల పోటీలలో నాగేశ్వర్‌రావు ప్రథమ, ఉప్పలయ్య ద్వితీయ బహుమతి అందుకున్నామని చెప్పారు.

బీఎస్పీ నూతన కమిటీ నియామకం.. సూర్యాపేట పట్టణం: బహుజన సమాజ్ పార్టీ జిల్లా నూతన కమిటీని శనివారం నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకు కిరణ్ కుమార్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎర్ర రాంబాబు, జిల్లా కార్యదర్శిగా దూరు మల్లయ్య, కోశాధికారిగా చింత రమేశ్ నియమితులయ్యారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ.. తుంగతుర్తి: మండల కేంద్రంలో తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. జాతీయ రహదారి-365 పక్కన కేటాయించిన స్థలంలో రజక సంఘం నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ అధ్యక్షుడు పూసపెల్లి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.



సూర్యాపేట: ఎస్‌ఎల్‌ఎస్ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఎల్‌ఎస్ పాఠశాల నిర్వాహకులు

దురాజ్‌పల్లిలోని ఎమ్మెస్సార్ సెంట్రల్ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



చిట్టి బుర్రలకు.. పదును..!

☛ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎస్ పాఠశాలలో శనివారం 'అంతర్జాల వినియోగం- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన కె.సౌమ్యలక్ష్మి (ప్రథమ), డి.జ్యోత్స్న (ద్వితీయ), డి.వైష్ణవి (తృతీయ)కు పాఠశాల కరస్పాండెంట్ చీకూరి రేవతి, ప్రిన్సిపల్ చీకూరి సాయికృష్ణ బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రాజేశ్వరి, శైలజ, సాయిరాజ్, సైదులు పాల్గొన్నారు.

☛ 'ఈనాడు' ఆధ్వర్యంలో దురాజ్‌పల్లిలో గల ఎమ్మెస్సార్ సెంట్రల్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన డి.నాగసాయిశ్రీ (ప్రథమ), ఎం.స్విని(ద్వితీయ), ఇ.శారోన్‌సుధి(తృతీయ)కు పాఠశాల కరస్పాండెంట్ కొల్లు శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. అకాడమిక్ డైరెక్టర్ బి.ప్రభాకర్, ప్రిన్సిపల్ జి.ఉమ, ఉపాధ్యాయులు జి.రాజేష్, వి.ఉమాదేవి, ఎస్.బాషా పాల్గొన్నారు. - సూర్యాపేట(మహాత్మాగాంధీరోడ్డు), చివ్వెంల, న్యూస్‌టుడే:



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఎమ్మెస్సార్ పాఠశాల యాజమాన్యం

వాస్తవాలను వివరించి పథకం లబ్ధిపొందాలి

నూతనకల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు మాత్రమే అందించే బాధ్యత అందరిపై ఉంటుందని, వాస్తవాలను వివరించి ప్రజలు లబ్ధి పొందాలని నూతనకల్ ఆర్ఐ హసన్ కోరారు. నూతనకల్ మండలంలోని యడవెల్లిలో బయ్యముత్తయ్య, చంద్రమ్మ దంపతులు కుమార్తె శైలజ వివాహం అనంతరం కల్యాణలక్ష్మి కోసం చేసుకున్న దరఖాస్తుపై శనివారం ఆయన దర్యాప్తు చేపట్టి మాట్లాడారు. పథకం పక్కదారి పట్టకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు దర్యాప్తులో పూర్తి సహకారం అందించాలని సూచించారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3050	2229
జైశ్రీరాం	3159	1856
ఐఆర్-64	2019	1406
హెచ్ఎంటీ	2559	2076
కందులు	8088	6093
పెసర	6558	3228
వేరుసెనగ	3913	3386

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు: ఆర్డీవో



మహ్మదాపురంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో వేణుమాధవ్, తదితరులు

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: ధాన్యం విక్రయించేందుకు దళారులను ఆశ్రయించి రైతులు మోసపోవద్దని ఆర్డీవో వేణుమాధవ్ సూచించారు. మండలంలోని మహ్మదాపురం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు జరపాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనల ప్రకారం ఆరబెట్టిన వడ్లను కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. పెన్‌పహాడ్, గాజులమొల్కాపురం గ్రామాల్లో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు లాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఎం అజయ్ నాయక్, ఏవో అనిల్‌కుమార్, ఆర్ఐ అజిజున్నిసా, పంచాయతీ కార్యదర్శి లావణ్య, ఇన్‌ఛార్జి సీసీ ఆశా, సంఘబంధం అధ్యక్షురాలు నీరజ, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి సీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దిరాల, మద్దిరాల గ్రామీణం: మండలంలోని మద్దిరాల, రెడ్డిగూడెం, కుక్కడం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య, ఏపీవో వెంకన్న, ఏఈవో మనోహర్, అనూష, సీసీ రమేష్, మహిళా సంఘ అధ్యక్షురాలు మైబా, తీగల ప్రమీష, సుజాత పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, మ్యాక్స్, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో 267 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఆర్డీఏ పీడీ అప్పారావు అన్నారు. పర్సాయపల్లి గ్రామంలో శనివారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, వడ్లను కాంటా వేశారు. జాజిరెడ్డిగూడెం, బొల్లంపల్లి, అర్వపల్లి, కాసర్లపహాడ్, కొమ్మాల, కోడూరు, రామన్నగూడెం, కుంచమర్తి, ఉయ్యాలవాడ గ్రామాలలో ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో పవన్ కుమార్, ఏపీఎం మల్లేష్, సీసీలు మహేష్, పద్మావతి పాల్గొన్నారు.

తిరుమలగిరి: రాజనాయక్‌తండా, కొక్యానాయక్‌తండాలో కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హరిప్రసాద్ ప్రారంభించారు. ఏపీఎం మధుసూదన్, సీసీ ఇద్దయ్య, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చివ్వెంల: మండల కేంద్రంలో పీఏసీఎస్ ఛైర్మన్, సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని కుడకుడలో ఎఫ్‌పీసీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. పీఏసీఎస్ ఛైర్మన్ మారినేని సుధీర్‌రావు, డీపీఎంలు అంజనేయులు, గోవింద్, సీఈవో వాసు, ఏపీఎం సైదయ్య, ఏఈవోలు వెంకట్‌రెడ్డి, శైలజ, సీసీలు వెంకన్న, శ్రీను, మాజీ సర్పంచి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని నాగారం, పేరబోయినగూడెం, నాగారం(బంగ్లా), ఫణిగిరి, మామిడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శోభారాణి శనివారం ప్రారంభించారు. సీసీ రామయ్య, నిర్వాహకులు విజయ, వెంకటమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: చిల్పకుంట్లలో పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఛైర్‌పర్సన్ నాగం జయసుధ ప్రారంభించారు. సీఈవో సంపెట వెంకన్న, యాస రజిత, బండపల్లి గణేశ్, ఇరుగు రవి పాల్గొన్నారు.

తుంగతుర్తి గ్రామీణం: మండలంలోని వెంపటి, దేవునిగుట్ట తండ, వెలుగుపల్లి, గొట్టిపర్తి, గానుగుబండ గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గోవింద్, తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషుకుమార్, ఆర్ఐ రవీందర్ పాల్గొన్నారు.

విధులను విస్మరిస్తే చర్యలు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కోటా చలం అన్నారు. అర్వపల్లి పీహెచ్‌సీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. సాధారణ కాన్పులను ప్రోత్సహించి మహిళలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. విధులు సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రిలో పరిసరాల శుభ్రత పాటించాలని, తాగునీటి వసతి, వైద్యం ఎలా ఉందని రోగులను అడిగి తెలుసుకున్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని కోటినాయక్‌తండాలో ఎస్సారెస్పీ కాలువ పక్కన గల కిరాణా దుకాణంలో శుక్రవారం రాత్రి దొంగతనం చోటుచేసుకుంది. రూ.పదివేల నగదు, మూడు మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. కాళీభావ్‌సింగ్‌తండాకు చెందిన జాటోత్ జ్యోతి ఈ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు దుకాణాన్ని బంద్ చేసి ఇంటికెళ్లారు. శనివారం దుకాణం తెరిచేందుకు రాగా షట్టర్ వంగిపోయి ఉంది. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తెలిపాడు.

పిడుగుపాటుకు గేదె మృతి

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పిడుగుపడి గేదె మృతి చెందిన సంఘటన రావులపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తాడూరి సోమయ్య గేదెను మేపుకొని వచ్చి సాయంత్రం ఇంటి సమీపంలోని చెట్టుకు కట్టేశారు. ఒక్కసారిగా ఉరుము, మెరుపులతో కూడిన వర్షంతోపాటు చెట్టుపై పిడుగు పడటంతో గేదె అక్కడిక్కడే మృతి చెందింది.

నాటుసారా పట్టివేత

మద్దిరాల, న్యూస్‌టుడే: మండలంలోని మామిండ్లమడవ ఆవాసం ఆంగోతుతండాకు చెందిన ఆంగోతు విజయ అక్రమంగా ఏడు లీటర్ల నాటుసారా విక్రయించేందుకు శనివారం వెళ్తుండగా.. మండలకేంద్రంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరన్న తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దూపహాడ్ శివారులో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా చివ్వెంల మండలం రాంకోటి తండాకు చెందిన దరావత్ మల్సూరు మూడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. పోలీసు సిబ్బంది శ్రీకాంత్, రమేష్‌లు తనిఖీలో పాల్గొన్నారు.

అప్పు చెల్లించలేదని చెప్పులతో ఇంటికి తోరణం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడంలేదని ఇంటికి చెప్పులు, పొరకతో తోరణం వేసి డప్పు చాటింపు వేయించిన సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం అస్లతండాలో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనలో పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. అస్లతండాకు చెందిన దంపతులైన వాంకుడోత్ కీమా, అనిత అదే తండాకు చెందిన దరావత్ రంజా వద్ద మూడేళ్ల క్రితం రూ.ఒక లక్ష అప్పు తీసుకున్నారు. కొద్దికాలానికే అనారోగ్యంతో కీమా చనిపోయారు. భార్య అనిత హైదరాబాద్‌కు వలసవెళ్లారు. డబ్బు చెల్లించాలని అనితను రంజా పలుమార్లు అడిగినా చెల్లించలేదు. వారం క్రితం రంజా, అతని కుటుంబ సభ్యులు పాతచెప్పులు, పాతచాట, పొరకలను దండగా కూర్చి తండాలోని అనిత ఇంటికి తోరణంగా ఏర్పాటు చేశారు. తండాలో డప్పు చాటింపు వేయించారు. ఇదేమిటని ప్రశ్నించిన అనిత బంధువులపై దాడి చేశారు. అనిత శనివారం ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు రంజాతోపాటు మరో ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ శంకర్‌నాయక్ శనివారం తెలిపారు.

అపహరించిన బంగారం విక్రయిస్తుండగా దొంగల అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: చోరీ చేసిన బంగారాన్ని విక్రయించేందుకు వెళ్తుండగా ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రవి తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పాత నేరస్థులు గంపల శ్యాం, రాడపంగి వీరబాబులకు నల్గొండ జిల్లా జైలులో పరిచయం ఏర్పడింది. బయటికి వచ్చిన తరువాత కలిసి చోరీలు చేయడం మొదలు పెట్టారు. ఇటీవల సూర్యాపేట పరిధిలోని నాలుగు ఇళ్లల్లో, చివ్వెంల మండలం పరిధిలో ఒక ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అపహరించిన మూడు తులాల బంగారం, 35 తులాల వెండిని పట్టణంలో విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు అనుమా



సూర్యాపేట: నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి కుమార్

నంతో పట్టుకున్నారు. దర్యాప్తులో దొంగతనం చేసినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్టు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్సైలు గోపి కృష్ణ, కుశలవ, కానిస్టేబుళ్లు కృష్ణ, కరుణాకర్, సైదులు, శివ, మధులను డీఎస్పీ అభినందించారు.